# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 184 | పేజీలు : 8 | వెల : రూ.2/- గురువారం 30 జులై 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## నేరచరిత్ర గొడ్డలి పార్టీ నేతది

### - అందులో చేరిన వారంతా నేర చరితులే

**సాక్ష్యాలను తారుమారు చేసిన వ్యక్తికి పరామర్శలా**

**ఏం మెజేస్ ఇద్దామని పరామర్శలకు వెళతారు**

**జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు**



**అమరావతి,మన జనప్రగతి 2026 జూలై 29:** వ్యవస్థలు నిర్మాణం చేద్దామనే సంకల్పంతో ఎవరైనా రాజకీయాల్లోకి వస్తారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కానీ వ్యవస్థల్ని నాశనం చేయటమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ అధినేత ఉన్నారంటూ వైఎస్ జగన్‌పై ఆయన మండిపడ్డారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా తాజా పరిణామాలపై వారు చర్చించారు. శ్రీకాకుళం జైలులో ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజును గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించనున్నారనే విషయాన్ని సీఎం దృష్టికి పార్టీ మిగతా2లో...

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు

# లోక్‌సభ ఆమోదం

**● వాడీవేడీ చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదం ● విపక్షాల సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం ● పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదన్న జితేంద్ర సింగ్ ● బిల్లు ఆమోదంతో లోక్‌సభ నేటికి వాయిదా**



**న్యూఢిల్లీ,మన జనప్రగతి 2026 జూలై 29:** వాడీవేడీ చర్చలు.. విమర్శలు ప్రతివిమర్శలు, ఆక్షేపణల మధ్య పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన మిగతా2లో...

## ఎపిలో ఉద్యోగాల భర్తీకి చర్యలు

**సెప్టెంబర్‌లో నోటిఫికేషన్లు విడుదల**

**అధికారులు, మంత్రుల బృందంతో లోకేశ్ చర్చలు**



2లో

## ప్రజల భద్రత, వన్యప్రాణుల సంరక్షణకు

# సమాన ప్రాధాన్యం

**మానవ, ఏనుగు సంఘర్షణలకు శాస్త్రీయ పరిష్కారంగా గుచ్ఛిమి ఎలిఫెంట్ క్యాంప్**

**ఆధునిక సాంకేతికతతో మన్యంలో అటవీ ఏనుగుల సమస్యకు పరిష్కారం**

**రైతుల పంటలు, ప్రజల ప్రాణాలకు రక్షణకు కీలక ముందడుగు**

**గుచ్ఛిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్**



**అమరావతి,మన జనప్రగతి 2026 జూలై 29:** ప్రకృతి మనకు చెందినది కాదు... మనమే ప్రకృతికి చెందినవాళ్లం. అందుకే ప్రకృతితో సామరస్యంగా జీవించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. ప్రజల భద్రతతోపాటు వన్యప్రాణుల సంరక్షణపైనా ప్రభుత్వానికి బాధ్యత ఉంది. అదే దృక్పథంతో మానవ, ఏనుగు సంఘర్షణలను తగ్గించడానికి గుచ్ఛిమి ఎలిఫెంట్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామ'ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మిగతా2లో...



## నేడు శ్రీకాకుళంలో వైఎస్ జగన్ పర్యటన

**సిదిరి అప్పలరాజును పరామర్శించనున్న జగన్**

**జైలు ములాఖత్‌కే అనుమతి ఉందన్న జిల్లా ఎస్పీ**

**శ్రీకాకుళం,మన జనప్రగతి 2026 జూలై 29:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటిం చున్నారు..పోలీసులు పలు ఆంక్షలు విధించారు. జైలు వద్ద ములాఖాత్ కార్యక్రమం వరకు మాత్రమే అనుమతి ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి తెలిపారు. వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా ర్యాలీలు, భారీ జనసమీకరణలకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ఎస్పీ స్పష్టం చేశారు. మిగతా2లో...

## మంగినపూడి బీచ్ రోడ్డుకు అనుమతించండి


**కేంద్రమంత్రి గడ్కరీని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర**



2లో

## టిటిడి పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

**- నకిలీ వెబ్‌సైట్ గుర్తించిన టిటిడి అధికారులు**




**తిరుమల,మన జనప్రగతి 2026 జూలై 29:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పేరుతో సైబర్ మోసగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండేలా ఫేక్ వెబ్‌సైట్ రూపొందించి, భక్తులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు మిగతా2లో...

## చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక బృందం భేటీ




**అమరావతి,మన జనప్రగతి 2026 జూలై 29:** ఏపీ సీఎం చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం భేటీ అయింది. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో తైవాన్‌కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్ క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, షెంగ్ హుయ్ టెక్ తదితర మిగతా2లో...



## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట


- పర్యావరణ అనుముతులు చెల్లుబాటు
- సుప్రీంకోర్టులో ఉపశమనం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి 2026 జూలై 29:**తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర మిగతా2లో...

## రైతులను ఆదుకోవడమే

# కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- నెగిటివ్ స్టేట్‌మెంట్లతో రైతులను మరింత నష్టపెట్టొద్దు: మంత్రి అచ్చెన్నాయుడు**



**అమరావతి,మన జనప్రగతి 2026 జూలై 29:** మిత్రపక్షంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా.. రాజకీయ నాయకుడిగా రైతుల శ్రేయస్సు కోరుకోవడం ప్రధాన లక్షణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతులకు మేలు చేసే సహేతుకమైన, నిర్మాణాత్మకమైన సలహాలను ఏ రాజకీయ పార్టీ నుంచి వచ్చినా ప్రభుత్వం తప్పకుండా స్వాగతిస్తుందని తెలిపారు. అయితే ప్రభుత్వం రైతుల సమస్యలపై సక్రమంగా స్పందిస్తూ, వారికి అండగా నిలుస్తున్న సమయంలో నెగిటివ్ స్టేట్‌మెంట్లతో రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదని హితవు పలికారు.పొగాకు మిగతా2లో...

# నేరచరిత్ర గొడ్డలి పార్టీ నేతది

(మొదటి పేజీ తరువాయి)

నేతలు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన స్పందించారు. వ్యవస్థల నిర్మాణం చేసే వాళ్లు చట్టాలను గౌరవిస్తూ వాటికి లోబడి నడుచుకుంటారని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కానీ గొడ్డలి పార్టీ నేతలకు చట్టాలంటే గౌరవం లేదన్నారు. గొర్రెల కాపరి చనిపోతే సాక్ష్యాలు తారుమారు చేసి ఇంకొకరి జీవితాన్ని బలి చేద్దామనుకున్న వారిని పరామర్శించడం ద్వారా సమాజానికి ఏం మెసేజ్ ఇస్తారంటూ వైసీపీ అధినేత తీరును ఎండగట్టారు. గతంలో కారు చక్రాల కింద వ్యక్తి నలిగిపోతే కనీసం అతడిని ఆసుపత్రికి తీసుకెళ్దామనే మానవత్వం కూడా గొడ్డలి పార్టీ అధినేతకు లేదని అన్నారు. పుట్టిన రోజులకు గొడ్డళ్లతో జంతు బలులు చేసి రాక్షసానందం పొందే హింసా ప్రవృత్తి ఆ పార్టీదని ఆయన అభివర్ణించారు. నేరాల నియంత్రణకు 2014-19 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అయితే 2019-24 మధ్య వాటికి మెయింటైనెన్స్ లేకపోవడంతో అవి నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే.. వాటన్నింటినీ పునరుద్ధరించటంతో నేరస్తుల్ని సాక్ష్యాలతో సహా పట్టుకోగలుగుతున్నామని వివరించారు. రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ చనిపోతే.. దానిని హత్యగా చిత్రీకరించి రాజకీయంగా ప్రభుత్వంపై బురద చల్లాలని చూశారని వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. సీసీ టీవీ ఆధారాలు అన్నీ బయటపెట్టే సరికి తోక ముడిచారంటూ ఆ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేర ప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి.. దానిని ఎదుటి వారిపై రుద్దాలని చూస్తారని వ్యాఖ్యానించారు. ఆలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారని పేర్కొన్నారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్తుల్ని పరామర్శించటమే పనిగా గొడ్డలి పార్టీ అధినేత వైఎస్ జగన్ చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. నేరప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి ఎదుటివారిపై రుద్దాలని చూస్తారు. అలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్థుల్ని పరామర్శించడమే గొడ్డలి పార్టీ పనిగా పెట్టుకుంది‘ అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాల ను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు. యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు. రాహుల్, ప్రియాంక, అఖిలేశ్, గొగోయ్ తదితరులు బిల్లుపై మాట్లాడారు.

# ప్రజల భద్రత, వన్యప్రాణుల సంరక్షణకు సమాన ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం గుచ్చిమిలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని పవన్ కళ్యాణ్ బుధవారం వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జ్ మంత్రి వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. అడవి ఏనుగుల సంచారాన్ని సమర్థవంతంగా నియంత్రించడం, ప్రజల ప్రాణాలు, రైతుల పంటలను రక్షించడం, దశాబ్దాల నుంచి ఉన్న మానవ?ఏనుగు సంఘర్షణను నివారించడమే లక్ష్యంగా ఈ శిబిరం పని చేయనుంది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ “అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు గ్రామాల్లోకి ప్రవేశించడం, రైతుల పంటలను ధ్వంసం చేయడం, ప్రజలు రాత్రివేళ భయాందోళనల మధ్య జీవించడం వంటి సమస్యలు పార్వతీపురం మన్యం జిల్లాలో చాలా కాలంగా కొనసాగుతున్నాయి. ఉత్తరాం ధ్రలో పర్యటిస్తున్నప్పుడు పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ, కొంత మంది స్థానిక ప్రజలు సమస్యను నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యతగా భావించి గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాను ఏర్పాటు చేశాం. ఉత్తరాంధ్రలో మానవ, ఏనుగు సంఘర్షణల నివారణలో ఈ కేంద్రం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది. గతంలో పలమనేరు ప్రాంతంలో చేపట్టిన క్లిష్టమైన ఆపరేషన్లలో కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యుతో పాటు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థంగా పని చేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా మానవ ఏనుగు సంఘర్షణల కారణంగా సంభవించే మరణాలను 70 శాతానికి పైగా తగ్గించడంతోపాటు, పంట నష్టాలను కూడా గణనీయంగా తగ్గించగలిగారు. అదే విజయాన్ని ఇప్పుడు పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పం. మనుషులు, ఏనుగులు మధ్య సామరస్య సహజీవనానికి వేదికగా ఈ గుచ్చిమి ఏనుగుల క్యాంప్ నిలవాలనే ఆశతో దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నాను. కర్ణాటక ప్రజలు, ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలుపార్వతీపురం జిల్లాలో ఈ రోజు మనం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామంటే దానికి ప్రధాన కారణం కర్ణాటక ప్రభుత్వం, అక్కడి ప్రజలు అందించిన సహకారం. మన విజ్ఞప్తిని గౌరవించి, ఎంతో ఆప్యాయతతో నాలుగు కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించడం వారి గొప్ప మనసుకు, స్నేహభావానికి నిదర్శనం. ఏనుగులను ఇవ్వడం అనేది సంపద ఇచ్చినట్లు అక్కడ ప్రజలు భావిస్తారు. అయినా తెలుగు ప్రజల రక్షణ కోసం ప్రేమతో కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించిన కర్ణాటక ప్రభుత్వం, ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి డి కె శివకుమార్ కి, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకి, అప్పటి అటవీ శాఖ మంత్రి, ప్రస్తుత పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. వారి సహకారం, స్నేహభావం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత పెంచాయి” అన్నారు. పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర, పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ, శాసన సభ విప్ తోయక జగదీశ్వరి, అటవీ పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి.చలపతి రావు, అటవీశాఖ సలహాదారు మల్లికా ర్జునరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్. నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నందిని సలారియా, విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐ.కె.వి.రాజు, పార్వతీ పురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా అటవీ అధికారి ప్రసూన పాల్గొన్నారు.

# టిటిడి పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించారు. నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించి, అర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ దర్శనం, శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్లు అందుబాటులో ఉన్నట్లు చూపిస్తూ భక్తులను ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఈ ఫేక్ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసేందుకు ప్రయత్నించే భక్తుల నుంచి వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం, ఆన్‌లైన్ చెల్లింపులు సేకరించి సైబర్ మోసాలకు పాల్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండేలా డిజైన్ చేయడంతో చాలామంది భక్తులు ఇది అసలైన వెబ్‌సైట్‌గా భావించి మోసపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇలాంటి నకిలీ వెబ్‌సైట్ల విషయంలో ఇప్పటికే పలుమార్లు టీటీడీ భక్తులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. వేంకటేశ్వరస్వామి దర్శనం, అర్జిత సేవలు, వసతి, శ్రీవాణి ట్రస్ట్ టికెట్లు వంటి అన్ని బుకింగ్‌లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక యాప్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, తెలియని లింకులు, అనధికార వెబ్‌సైట్లను నమ్మొద్దని టీటీడీ అధికారులు సూచించారు. వెబ్‌సైట్ అడ్రస్‌ను ఒకటికి రెండుసార్లు పరిశీలించి మాత్రమే ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వెబ్‌సైట్లు లేదా లింకులు కనిపిస్తే వెంటనే టీటీడీ అధికారులకు లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. భక్తులు అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి సైబర్ మోసాల నుంచి బయటపడవచ్చని టీటీడీ అధికారులు పేర్కొన్నారు.

# రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రైతులను గతంలోనూ.. ఇప్పుడూ.. సక్రమంగా ఆదుకున్నది తెదేపా, కూటమి ప్రభుత్వాలేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 2014-15లో తొలిసారిగా ఎఫ్‌సీవీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు కేజీకి రూ.20 చొప్పున ఆర్థిక సాయం అందించి రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 11 మిలియన్ కేజీల పొగాకు మాత్రమే కొనుగోలు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని గుర్తించి గతంలో హెచ్‌డీ బర్లీ పొగాకును 25 మిలియన్ కేజీల మేర రూ.270 కోట్లతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని మంత్రి తెలిపారు. రైతు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం బాధ్యతగా స్పందించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు.ప్రస్తుతం అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు, బ్రెజిల్, టాంజానియా వంటి దేశాల నుంచి తక్కువ ధరలకు పొగాకు అందుబాటులో ఉండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అచ్చెన్నాయుడు వివరించారు.

ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, మరోవైపు పొగాకు వ్యాపారులు, కంపెనీలపై ఒత్తిడి తీసుకొచ్చి రైతుల నుంచి కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు కూడా ప్రభుత్వం చేసిన ప్రయత్నం సఫలీకృతమైందని చెప్పారు.ఎన్ని ఆర్థికపరమైన ఒత్తిళ్లు, ఇబ్బందులు ఉన్నప్పటికీ కేంద్రాన్ని ఒప్పించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పొగాకు రైతులకు కేజీకి రూ.20 చొప్పున సాయం అందించేలా చర్యలు చేపట్టాం. 94 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు రూ.188 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధం చేశాం. అతి కొద్ది రోజుల్లోనే ఈ ప్రక్రియను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

ఎఫ్‌సీవీ పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి టొబాకో బోర్డు, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిరోజూ రైతుల సమస్యలను సమీక్షిస్తూ, ప్రత్యేకంగా దృష్టి సారించి తగిన ఆదేశాలు ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నిరంతర పర్యవేక్షణ, కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే రైతులకు రూ.188 కోట్ల సాయం అందించే స్థాయికి చేరుకున్నామని స్పష్టం చేశారు. రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకుంటుంటే జగన్‌మోహన్ రెడ్డికి ఇవేవీ కనిపించడం లేదా? అని మంత్రి ప్రశ్నించారు.

# ఎపిలో ఉద్యోగాల భర్తీకి చర్యలు

**అమరావతి,మన జనప్రగతి 2026 జూలై 29:** రాష్ట్రంలో నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ విడుదల పకడ్బందీగా ఉండాలని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో జాబ్ క్యాలెండర్-2026పై మంత్రుల బృందం, అధికారులతో నారా లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీలో జాబ్ క్యాలెండర్-2026 ప్రకారం నాలుగు దశల్లో మొత్తం 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రెండో దశ కింద వివిధ శాఖల్లోని 3,168 పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 15న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు, సాంకేతిక కారణాల వల్లే ఆగస్ట్ నుంచి సెప్టెంబర్ 15కు రెండో దశ నోటిఫికేషన్ తేదీ మారిందని వివరించారు. మూడు, నాలుగు దశల్లోని 5,369 ఉద్యోగాల భర్తీకి అక్టోబర్ 15న నోటిఫికేషన్ విడుదల చేయాలని మంత్రి దిశానిర్దేశర చేశారు. గ్రూప్-1లో గతంలో సూచించిన పోస్టుల కంటే మరికొన్ని ఉద్యోగాలను పెంచాలని అధికారులను లోకేశ్ ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, సీఎస్ జి.సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

# నేడు శ్రీకాకుళంలో వైఎస్ జగన్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

గతంలో జరిగిన క్రౌడ్ గేదరింగ్ ఘటనలు, ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో భద్రతా పరమైన అంశాలు, శాంతిభద్రతల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పోలీసులు విధించిన నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ప్రజలు, పార్టీ శ్రేణులు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌కు ఉన్న జడ్ ప్లస్ (జి?) భద్రతా కేటగిరీ ప్రకారం పూర్తి భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే ఆయన కాన్వాయ్‌లో ఎనిమిది వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో సంచలనం రేపిన హిట్ అండ్ రన్ కేసులో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మకు ఊరట లభించింది. సోంపేట కోర్టు విధించిన షరతులతో కూడిన బెయిల్‌పై ఆరవ్ వర్మతో పాటు ఎ2 సిద్దార్థ్ త్యాడి అంపోలు జిల్లా జైలు నుంచి బుధవారం విడుదలయ్యారు. జైలు వద్దకు చేరుకున్న ఆరవ్ తల్లి శ్రీదేవి భావోద్వేగానికి గురై కుమారుడిని ముద్దాడుతూ ఆలింగనం చేసుకున్నారు. సిద్దార్థ్ త్యాడిని కూడా ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఇద్దరినీ తన వాహనంలో ఎక్కించుకుని పలాసకు తీసుకెళ్లారు. ఇదే హిట్ అండ్ రన్ కేసులో మాజీమంత్రి సీదిరి అప్పలరాజు ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా అంపోలు జైలులో ఉన్నారు. పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు గురువారం శ్రీకాకుళం వెళ్లనున్నారు వైఎస్ జగన్.. ఈ నేపథ్యంలో పోలీసులు ఆంక్షలు విధించడంతో.. జగన్ పర్యటన ఎలా సాగనుంది అనేది ఉత్కంఠగా మారింది..

# మంగినపూడి బీచ్ రోడ్డుకు అనుమతించండి

**న్యూఢిల్లీ,మన జనప్రగతి 2026 జూలై 29:** బందరు పోర్టు నుంచి మంగినపూడి బీచ్ మీదుగా రోడ్డు నిర్మాణానికి అనుమతించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిశారు. ఈ సమావేశంలో చర్చించిన విషయాల గురించి మీడియాకు మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.150 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించాలని మంత్రి సూచించారు. ప్రతిపాదిత రోడ్డు ప్రభుత్వ భూముల గుండా వెళ్తున్నందున భూసేకరణ సమస్య లేదని తెలిపారు. ఈ రోడ్డు పూర్తి అయితే జాతీయ, అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రధాన ద్వారంగా మారుతుందని చెప్పుకొచ్చారు. పోర్ట్ ద్వారా ఎగుమతి, దిగుమతి, కంటైనర్ ట్రాఫిక్ ఊపందుకుంటుందని వెల్లడించారు. మచిలీపట్నం ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్ పార్కులు, క్లస్టర్‌లకు సానుకూలంగా మారుతుందని మంత్రి వివరించారు. మంగినపూడి బీచ్‌కు రోడ్డు సదుపాయం పెరిగితే పర్యాటకాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. మచిలీపట్నం నుంచి బంటుమిల్లి వరకు 20 కిలోమీటర్ల రోడ్డుకు ఆమోదం తెలపాలని విన్నవించారు. ఈ రోడ్డు పూర్తయితే పోర్టు, పారిశ్రామిక, పర్యాటక, లాజిస్టిక్స్ అభివృద్ధికి ప్రయోజనమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక బృందం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ఎయిర్‌పోర్టులు, రైలు, రోడ్డు మార్గాల పటిష్ఠమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్ తదితర అంశాలను తైవాన్ బృందానికి సీఎం వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్డ్ మాన్యుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వారికి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు వేగంగా అనుమతులు జారీ చేయటంతో పాటు పూర్తిస్థాయి ప్రోత్సాహాన్ని అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# వందేమాతరం బిల్లుకు రాజ్యసభ ఆమోదం

## - అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్షాల వాకౌట్

**న్యూఢిల్లీ,మన జనప్రగతి 2026 జూలై 29:** జాతీయ గేయం వందేమాతరంపై బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న ప్రవేశపెట్టారు. వందేమాతరాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. బిల్లుపై సభలో చర్చ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేతలు భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఇటీవల దిల్లీలో విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని... దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలో పాల్గొనాలని సభ్యులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ పదే పదే కోరినప్పటికీ ఆందోళనలు విరమించలేదు. కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలె బిల్లుపై మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణించి, దోషులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో నిబంధనలు రూపొందించారు.

# శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం





**తిరుమల మన జనప్రగతి 2026 జూలై 29:–**తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ఉదయం శ్రీశ్రీశ్రీ పెద్దజీయంగారి చాతుర్మాస దీక్ష సంకల్పం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శ్రీ వైష్ణవ సంప్రదాయకర్త శ్రీ రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస దీక్ష విశేషమైంది. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని ప్రాశస్త్యం.కావున ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారు. చాతుర్మాస వ్రతం ప్రాచీనకాలం నుండి ఆచరణలో ఉన్నట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది.ముందుగా శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి మఠంలో కలశ స్థాపన, కలశ పూజ,విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.తరువాత సేకరించిన పుట్ట మన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం శ్రీ పెద్దజీయంగారు తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కనగల జీయ్యంగారి మఠం వద్ద నుండి శ్రీ చిన్నజీయంగారు మరియు ఇతర శిష్యబృందంతో బయల్దేరారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి పుష్కరిణి, శ్రీ వరాహస్వామివారిని దర్శించుకున్నారు. అక్కడినుంచి మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు.శ్రీవారి ఆలయ మహద్వారం చెంత టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, ఇతర ఆలయ అధికారులతో కలిసి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీ జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత శ్రీ పెద్దజీయంగారికి మేల్‌చాట్ వస్త్రాన్ని, శ్రీ చిన్నజీయంగారికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరించారు.అనంతరం శ్రీపెద్దజీయర్ మఠంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి కలిసి ఈవో,బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి,ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం,పేష్కార్ శ్రీ రామ కృష్ణ, నాసన్మానించారు.

# మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్



**ఆదోని మన జనప్రగతి జూలై 29:–**మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు.బుధవారం సాయంత్రం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మంత్రి నారా లోకేష్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కొద్దిసేపు వారితో మాట్లాడారు.

# నేడు వేములలో పంచాయతీ అభివృద్ధికి దిశానిర్దేశం

**మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి జీపిడీపీపై శిక్షణ**

**వేముల మండలం ఎంపీడీఓ శారదమ్మ ప్రకటన**



**వేముల మన జనప్రగతి జూలై 29:–**వేముల మండలంలోని గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపిడీపీ)పై నేడు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీఓ శారదమ్మ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అందులో భాగంగా ఆమె మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ కమిషనర్, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆదేశాల మేరకు వేముల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అనగా నేడు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన, పంచాయతీల పనితీరు మెరుగుదల, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.ఈ కార్యక్రమానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు,జడ్పీటీసీ,ఎంపీటీసీ సభ్యులు,గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు,పంచాయతీ కార్యదర్శులు,మండల స్థాయి అధికారులు,డిజిటల్ సహాయకులు,ఇంజనీరింగ్ సహాయకులు,ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక స్వయం సహాయక సంఘం అనిమేటర్ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని అందరూ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవో శారదమ్మ సూచించారు.శిక్షణకు హాజరయ్యే వారికి మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

# కల్తీ మాంసం విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తప్పవు: వేంపల్లె ఈఓ గాండ్ల కవిత



**వేంపల్లె మన జనప్రగతి జులై 29:–**వేంపల్లి లో వినియోగదారులకు కల్తీ మాంసం విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గ్రామపంచాయతీ ఈవో గాండ్ల కవిత మాంసం విక్రయదారులకు హెచ్చరించారు. స్థానిక తిరుమల థియేటర్ వద్ద ఉన్న మటన్ మార్కెట్ లో ఓ వ్యక్తి చనిపోయిన పొట్టేలు మాంసం విక్రయిస్తున్నారని స్థానికులు గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి వెంకటసుబ్బయ్య డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య ఆదేశాల మేరకు ఈవో కవిత తమ సిబ్బందిచే సదరు మటన్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. కిలో మాంసం రూ 850 కి విక్రయిస్తూ ప్రజలకు నాసిరకం మాంసం విక్రయించడం అన్యాయమన్నారు. ఇకపై వినియోగదారులకు గొర్రెలను కానీ చనిపోయిన జీవాల మాంసం విక్రయిస్తే కేసులు తప్పవన్నారు. ఇకపై తరచూ దాడులు నిర్వహిస్తూనే ఉంటామని ఆమె పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది శివరామ్ ప్రసాద్, చాను, రాజుల పవన్ కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం


## సుద్దవాగు రక్షణ గోడ నిర్మాణానికి మంత్రి టీ.జీ. భరత్ శంకుస్థాపన






**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 29:–**గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి నిధులు సమీకరించి అభివృద్ధి పనులను చేపడుతున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీ.జీ. భరత్ గుప్తా అన్నారు. బుధవారం నగరంలోని 23, 24 వార్డుల పరిధిలోని కేసీ కెనాల్ సమీపంలో సుద్దవాగు రక్షణ గోడ నిర్మాణానికి నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.అనంతరం కేసీ కెనాల్‌లో బీటీఐ జీవ లార్విసైడ్ పిచికారీ ప్రక్రియను పరిశీలించిన మంత్రి, పిచికారీని మరింత ముమ్మరం చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. వర్షాల సమయంలో శ్రీరామ్‌నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో సుద్దవాగు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జలవనరుల శాఖ రూ.2.50 కోట్లతో 250 మీటర్ల మేర రక్షణ గోడ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.నిధుల మంజూరులో జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సహకారం ఎంతో ఉందని తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో మరిన్ని నిధులు సాధించి, సుద్దవాగుకు దశలవారీగా పూర్తి స్థాయిలో రక్షణ గోడ నిర్మిస్తామని చెప్పారు. నగరంలోని దశాబ్దాల నాటి సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో శాశ్వత పరిష్కారం చూపుతామని వెల్లడించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, నాయకత్వంతో నగరంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని మంత్రి అన్నారు. గుజరాత్, సింగపూర్ తరహాలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి నారా లోకేష్ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడంలో విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ వస్తుందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఇటీవల తనకు తెలిపినట్లు వెల్లడించారు.నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. అధిక వర్షాల సమయంలో సుద్దవాగు పరిసరాల్లో నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు రక్షణ గోడ నిర్మాణం అవసరమని తెలిపారు. శ్రీరామ్‌నగర్ వద్ద సుద్దవాగు వంతెన నుంచి కేసీ కెనాల్ వరకు 250 మీటర్ల పొడవున జలవనరుల శాఖతో సమన్వయంగా పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ రమణమూర్తి, జలవనరుల శాఖ ఎస్ఈ శైలేశ్వర్, ఎంఈ బి. విజయరాజు, నగరపాలక ఎంఈ గిరిరాజ్, డీఈఈ నరేష్, ఏఈ జనార్ధన్, జలవనరుల శాఖ డీఈఈ బి. శ్రీనివాసనాయక్, విజయకుమార్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా సమగ్ర అభివృద్ధి కార్యాచరణ చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 29:–**ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా సమగ్ర అభివృద్ధి కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి నియోజకవర్గ ప్రత్యేక అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో స్వర్ణాంధ్ర ఏ 2047 లో భాగంగా వివిధ శాఖల స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జి.డి.డి.పి)పై సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు అమలు చేయనున్న కార్యాచరణ ప్రణాళిక (ఆక్షన్ ప్లాన్) పై జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక మరియు గణాంకాల డైరెక్టర్ బి.గోపాల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం యొక్క స్థానిక వనరులు, ప్రత్యేకతలు మరియు అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ నియోజకవర్గ ప్రత్యేక అధికారులను ఆదేశించారు.వీటితో పాటు స్వల్పకాలిక ప్రయోజనకరమైన కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. తక్కువ నీటితో వరి సాగు చేసే ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, వాటిని విస్తృతంగా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో నీటి కొరత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వరి సాగు కంటే ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం తదితర ప్రాంతాల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మామిడి, జామ, దానిమ్మ, సపోటా వంటి అధిక ఆదాయం అందించే వాణిజ్య పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.. పశువుల పెంపకానికి సంబంధించిన రుణాలను త్వరితగతిన ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రతి డివిజన్‌లో స్థానిక వనరులు, వ్యవసాయ అవకాశాలు, ప్రత్యేకతలను గుర్తించి, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. విండ్ పవర్, సోలార్ పవర్ రంగాల్లో ఉన్న అవకాశాలను మరింత విస్తరించేందుకు కొత్త కంపెనీలను ఆకర్షించే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖ తన పరిధిలోని అభివృద్ధి పనులపై స్పష్టమైన ప్రణాళికలు సిద్ధం చేసి ప్రతిపాదనలు అందించాలని, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు శాఖలతో నిరంతరం సమన్వయం చేస్తూ ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేయించాలన్నారు. పత్తి సాగు చేస్తున్న ప్రతి రైతు క్లస్టర్ బీన్ (గోరుచిక్కుడు), కంది, జొన్న, సజ్జ, బెండ వంటి పంటల్లో కనీసం రెండు పంటలను అంతర పంటలుగా సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించి 5 కోర్సు లను గుర్తించి వాటిని కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిపిఓ భారతి, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డ్వామా పిడి నరసింహ రెడ్డి, డిఈఓ సుధాకర్, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, ఐసిడిఎస్ పిడి విజయ, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ పత్తికొండ పర్యటనపై సీపీఎం బహిరంగ లేఖ




**• సోలార్ భూ లీజు గడువు తగ్గించాలి.. • సాగునీరు రహదారుల సమస్యలు పరిష్కరించాలి**

**పత్తికొండ మన జనప్రగతి జూలై 29:–**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పత్తికొండ పర్యటన సందర్భంగా నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ లేఖ విడుదల చేశారు. పత్తికొండ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.హోసూరు గ్రామంలో టాటా పవర్ సోలార్ ప్రాజెక్టు కోసం తీసుకున్న భూముల లీజు ఒప్పందాన్ని 30 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాలకు తగ్గించాలని, రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున లీజు చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే హంద్రీ కాలువకు హోసూరు సమీపంలో స్లూయిజ్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని కోరారు. హంద్రీనీవా కాలువల నుంచి పెద్దహుల్తి, చిన్నహుల్తి, జూటూరు, దూదేకొండ, కోతిరాళ్ల గ్రామాలకు పంట కాలువల ద్వారా సాగునీరు, తాగునీరు అందించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.టమోటా రైతుల ప్రయోజనాల కోసం నిర్మాణంలో ఉన్న టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని, పత్తికొండ నియోజకవర్గ కేంద్రంలోని రోడ్లను విస్తరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే పత్తికొండ ప్రాంతం నిత్యం కరువుకు నిలయంగా ఉందని, ఇలాంటి ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి, ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి పర్యటనలు జరుగుతున్నప్పటికీ పత్తికొండ అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై స్పష్టమైన హామీలు రావడం లేదని విమర్శించారు.హోసూరు గ్రామంలో దాదాపు 1800 ఎకరాల్లో నిర్మిస్తున్న టాటా పవర్ సోలార్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ హాజరవుతున్న నేపథ్యంలో, ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్తున్నామని, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.ఎస్. రాధాకృష్ణ, మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు రంగారెడ్డి, వెంకటేశులు, గోపాల్, రామాంజనేయులు, సురేంద్ర, సిద్ధాగౌడ్, ప్రజాసంఘాల నాయకులు ఎం. రవిచంద్ర, ఉశేని, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
30- 07 - 2026

## గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి





**గాలివీడు మన జనప్రగతి జులై 29:-** గాలివీడు మండలం చీమలచెరువుపల్లెలో గంగమ్మ ఆలయ మండల పూజల ముగింపు సందర్భంగా బుధవారం వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి గ్రామ ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. వేదమంత్రాల నడుమ ఆయన చేత ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి, తీర్థప్రసాదాలు అందించి దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గంగమ్మ తల్లి కటాక్షంతో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతాంగం సస్యశ్యామలంగా వర్ధిల్లాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం గ్రామ ప్రజలతో ఆప్యాయంగా మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

## బొల్లవరంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి డోర్ టు డోర్ ప్రచారం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జులై 29:-**కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన 'నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా మూడో రోజు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 1వ వార్డు బొల్లవరంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిశారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, అభివృద్ధి పనులు సక్రమంగా జరుగుతున్నాయా అనే అంశాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను విని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యనమల రామసుబ్బారెడ్డి, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ దాతిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పొడావుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాముకు పటిష్ట భద్రత: కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ మన జనప్రగతి జులై 29:-**కాకినాడ కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. రెవెన్యూ, పోలీసు, ఎన్నికల అధికారులతో కలిసి గోదాములో భద్రతా ఏర్పాట్లు, ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా రెవెన్యూ, పోలీసు, ఎన్నికల శాఖల అధికారులు సంయుక్తంగా గోదామును తనిఖీ చేస్తారని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల తనిఖీ నిర్వహించి, నివేదికను భారత ఎన్నికల సంఘానికి పంపాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి టి తిప్పే నాయక్, కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం జగన్నాథం తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడి తగ్గే అవకాశం




**చిట్వేలి మన జనప్రగతి జులై 29:-** ఎల్‌నినో ప్రభావంతో బోరు బావులలో నీరు తగ్గి పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉందని చిట్వేలి మండల వ్యవసాయ శాఖ అధికారి జి. సుధాకర్ సూచించారు. చిట్వేలి మండలం కే.వి.ఆర్.ఆర్ పురం, పెద్దూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో అకస్మాతుగా బోరు బావులలో నీటి మట్టం తగ్గిపోయి బోర్లు ఎండి పంటలకు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికి మండలంలో 30 శాతం లోటు వర్షపాతం ఉందని, రైతులు నీటిని పంటలకు పొదుపుగా అవసరం మేర వాడాలని, ఆరు తడి పంటలు సాగు చేయాలనీ సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడి తగ్గే అవకాశం ఉన్నందున నోటిఫైడ్ పంటలైన అరటి, వేరుశనగ కి జూలై 31 లోపు, వరి కి ఆగస్టు 15 లోపు పంట భీమా చేసుకుంటే రైతుకు రక్షణ గా ఉంటుందని తెలిపారు. ఉద్యాన పంటలైన మామిడి, నిమ్మ సాగుకు కూడా నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, కావున రైతులు ఉద్యాన పంటలలో పిఎండిఎస్ కిట్స్ విత్తన గుళికలు వేస్తే వచ్చే పంట పశు గ్రాసంగా ఉపయోగ పడటంతో పాటు, భూమి మీద గ్రీన్ కవర్ గా ఉండటం వల్ల నీరు నేలలో త్వరగా ఆవిరి కాకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు అంతర పంటలు, మిశ్రమ పంటలు సాగు చేస్తే అధిక ఆదాయం పొందడం సాధ్యం అవుతుందని తెలిపారు. పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలని, తద్వారా చీడ పీడలని తగ్గించ వచ్చునని తెలిపారు. మార్కెట్ కి అనుగుణంగా పంటలను సాగు చేయాలనీ, తద్వారా రైతులు మంచి ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథంపై అవగాహన కార్యక్రమం: డిడిఓ వెంకట సుబ్బయ్య



**వేంపల్లె మన జనప్రగతి జులై 29:-** ఏపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ రథంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వెంకట సుబ్బయ్య వెల్లడించారు. బుధవారం స్థానిక పాత బజార్ ప్రాంతంలో స్వచ్ఛ రథాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛరథం ద్వారా పల్లెల్లో చెత్త నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్, కాగితం, ఇనుము వంటి పొడి చెత్తను తూకం వేసి, ఆ విలువకు సరిపడా నిత్యవసర సరుకులు అందించడం జరుగుతోందన్నారు. గ్రామాల శుభ్రత చర్యలు పాటించి, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నివారించడమే స్వచ్ఛ రథం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కుళాయమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య, ఇఓ కవిత, సిబ్బంది రాహుల్, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లెలో ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు

### - వ్యాస మహర్షి చిత్రపటానికి నివాళి



**వేంపల్లె మన జనప్రగతి జులై 29:-** వేంపల్లె లో గురు పూర్ణిమ వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపిసిసి మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్ తులసిరెడ్డి మాట్లాడుతూ వ్యాస మహర్షి గురువులకే గురువు అని కొనియాడారు. మానవాళికి విజ్ఞానాన్ని అందించిన ఆది గురువు వేద వ్యాసుడని తెలిపారు. వేదాన్ని ఋగ్వేదం, యజుర్వేదం, సామవేధం, అధర్వణ వేధాలను నాలుగు వేధాలుగా విభజించి మానవాళికి అందించారన్నారు. పంచమ వేదమైన మహా భారాతాన్ని, మహా భాగవతాన్ని, భగవద్గీతా, మత్స్య పురాణం, స్కాంద పురాణం వరకు అష్టాదశ పురాణాలను, బృహదారణ్యక ఉపనిషత్తు వంటి 108 ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రాలను రచించి సమాజానికి అందించిన మహా జ్ఞాని వ్యాస మహర్షి అన్నారు. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, నాయకులు సుబ్రమణ్యం, రామాంజనేయ రెడ్డి, అమర్, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, బద్రీ, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరులో భక్తులతో పోటెత్తిన శిరిడి ఆలయాలు

### - ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు





**చెన్నూరు మన జనప్రగతి జులై 29:-**మండల కేంద్రమైన చెన్నూరు బ్రాహ్మణ వీధి. పడమట వీధి. కె.ఓ.ఆర్ కాలనీ. క్రాస్ రోడ్డు గోసుల కళ్యాణమండపం ప్రాంతాల్లో వెలసిన శిరిడి సాయిబాబా ఆలయాల్లో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఒకేసారి వ్యాస పౌర్ణమి.ఆషాడ పౌర్ణమి. గురు పౌర్ణమి. మహా షాడి పర్వదినాలు కలిసి రావడంతో సాయిబాబా ఆలయాలతో పాటు శివాలయాలు వెంకటేశ్వర స్వామి ఆంజనేయస్వామి అమ్మవారి ఆలయాలును ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు దర్శించుకున్నారు. సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక అభిషేక పూజలు అలంకరణ నిర్వహించారు. పడమటి వీధిలో వెలసిన సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. చెన్నూరు ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయం ప్రక్కన వెలసిన ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. చెన్నూరు పెన్నా నది ఒడ్డున వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు జరిగాయి. చెన్నూరు ట్రంకు రోడ్డు ప్రక్కన వెలసిన శివాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. బ్రాహ్మణ వీధి లో వెలసిన వాసవి వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో పూజలు జరిగాయి. పరమట వీధిలో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో అభిషేక పూజలు అలంకరణ నిర్వహించారు. చెన్నూరు లోని పలు రామాలయాల్లో పూజలు జరిగాయి. చెన్నూరు మండలం శివాలపల్లి జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అభిషేక పూజలు అలంకరణ నిర్వహించారు.

## మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అక్రమ అరెస్ట్‌పై వైఎస్సార్‌సీపీ ఆగ్రహం..!




**కడప మన జనప్రగతి జులై 29:-** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులే లక్ష్యంగా కక్షసాధింపు రాజకీయాలు చేస్తోందని కడప జిల్లా బీసీ అధ్యక్షులు ఎన్.శివరామకృష్ణుడు, మహిళా జిల్లా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకట సుబ్బమ్మ ఇతర బీసీ నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.బుధవారం ఈ సందర్భంగా కడప నగరం వై ఎస్ ఆర్ సి పి జిల్లా కార్యాలయంలో వారు మీడియా సమావేశం లో మాట్లాడుతూ...విద్యావంతుడు, డాక్టర్, పలాసలో మంచి గుర్తింపు తెచ్చుకున్న బీసీ నాయకుడు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడూ బీసీలను తొక్కేయడానికే చూస్తోంది.తక్షణమే సీదిరి అప్పలరాజు పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, ఆయనకు బెయిల్ మంజూరు చేయాలి. లేనిపక్షంలో మత్స్యకార, బెస్త కమ్యూనిటీ, బీసీలందరం కలిసి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయుకులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులు విషం చిమ్మడం సిగ్గుచేటు




**కడప మన జనప్రగతి జులై 29:-** మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన వేలాది మంది యువత ప్రతిభను అవమానించే రాజకీయాలు మానుకోవాలని, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తే వాటికి ఆధారాలు చూపాలని, లేకపోతే ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వైసీపీ నాయకులకు బొజ్జ తిరుమలేష్ సవాల్ విసిరారు.బుధవారం కడప నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని విమర్శించారు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేసి వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపిందన్నారు.ఏడాది తర్వాత ఎలాంటి ఆధారాలు లేకుండా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా దుష్ప్రచారం చేస్తూ ర్యాలీలు చేయడం సిగ్గుచేటని అన్నారుకూటమి ప్రభుత్వం ఇప్పటికే 16 వేలకుపైగా టీచర్ ఉద్యోగాలు, 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాలు, 980 గ్రూప్-2 ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు, మరో 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విసిరిన బహిరంగ చర్చ సవాల్‌కు సమాధానం చెప్పకుండా బెంగళూరుకు వెళ్లిన జగన్ మోహన్ రెడ్డి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగులను రెచ్చగొడుతూ ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను అవమానిస్తు, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తూ ఫేక్ ప్రచారాలు చేయడం సబబు కాదన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో వైసిపి పేటీఎం బ్యాచ్ ద్వారా భయాందోళనలు సృష్టించి, విద్యార్థులను బలవంతంగా ర్యాలీలకు తీసుకురావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఒక్క మెగా డీఎస్సీ కూడా నిర్వహించలేదని, జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మిశెట్టి చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు సుమన్, దినేష్, కళ్యాణ్, గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లె గ్రామ పంచాయతీని కైవసం చేసుకుంటాం

### - టిడిపి పులివెందుల ఇంచార్జీ బిటెక్ రవి.



**వేంపల్లె మన జనప్రగతి జులై 29:**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వేంపల్లె గ్రామ పంచాయతీని కైవసం చేసుకుంటామని టిడిపి పులివెందుల ఇంచార్జీ బిటెక్ రవి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లె లో ఆయన ఇంటింటి కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. ప్రజా సమస్యలపై ఆరాతీసి, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గడిచిన రెండేళ్ల టిడిపి కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలందరూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికల్లో తమ ప్రభుత్వం చెప్పిన హామీలను విడతలవారీగా నెరవేర్చడంతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను శ్రీకారం చుట్టిందన్నారు. ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధే లక్ష్యంగా పాలన అందిస్తున్నట్లు ఆయన వివరించారు.**టిడిపి లోకి పలు కుటుంబాలు చేరిక..** స్థానిక శ్రీరామనగర్ ప్రాంతానికి చెందిన పలు కుటుంబాలు టిడిపి లోకి చేరాయి. ఆ పార్టీ యువ నాయకుడు డక్కారమేష్ ఆధ్వర్యంలో వీరికి ఇంచార్జీ బిటెక్ రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బిటెక్ రవి వారిని సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
30- 07 - 2026

# వైభవంగా శీతల గంగమ్మ జాతర ప్రారంభం




**సిద్ధవటం మన జనప్రగతి జూలై 29:**-కడపచెన్నై జాతీయ రహదారిపై మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతిపురంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి 23వ వార్షిక జాతర సందర్భంగా బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతర లో భాగంగా అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారి రంగమ్మ తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రానికి అమ్మవారి మట్టి ప్రతిమను తయారు చేసి రాత్రికి ఆలయంలోని వేప పందిరిలో కుదుట పరచి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేస్తామని తెలిపారు. గురువారం బోనాలు, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సుధా మురళి, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు పంపిణీ: సిడిపిఓ వి.సునిత



**వేంపల్లె మన జనప్రగతి జూలై 29:-** మండల పరిధిలోని 42 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ లు పంపిణీ చేసినట్లు వేంపల్లె ఐసిడిఎస్ సిడిపిఓ వి.సునిత అన్నారు. బుధవారం స్థానిక గాండ్లవీధి, నందిపల్లిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఇండక్షన్ స్టవ్ వినియోగం, పనితీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వంట గ్యాస్ కొరత ఏర్పడుతున్న అసౌకర్యాన్ని ప్రభుత్వం గుర్తించి ప్రత్యామ్నాయంగా నేషనల్ ఎఫిషియేన్సీ కుకింగ్ సంస్థకు చెందిన ఇండక్షన్ స్టవ్ లను వినియోగించేందుకు ఆదేశించినట్లు తెలిపారు. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 55 వేల అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ తో పాటు వంట పాత్రలు సరఫరా చేసినట్లు వెల్లడించారు. దీంట్లో భాగంగా వేంపల్లె మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు వీటిని సరఫరా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు డా. స్వర్ణలత, సుభద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

# నమ్మకంతో కూడిన వైద్యం అందించాలి..!: ఎమ్మెల్యే చినరాజప్ప



**కాకినాడ మన జనప్రగతి జూలై 29:**-మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడలో బ్రాంచిలో నూతనంగా ఏర్పాటు చేసిన హై డిపెండెన్సీ యూనిట్ బుధవారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ప్రారంభించారు.ఈ సందర్భంగా నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ ఆధునిక వైద్య సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యాన్ని అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో మరియు క్లిష్టమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు హై డిపెండెన్సీ యూనిట్ ఎంతో ఉపయోగ పడుతుందని, అత్యాధునిక పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బందితో ఈ హై డిపెండెన్సీ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు.హాస్పిటల్ కాకినాడ సెంటర్ హెడ్ నందికోళ్ళ అంజిబాబు మాట్లాడుతూపెద్దాపురం నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లా వ్యాప్తంగా, అలాగే కోనసీమ జిల్లాల్లోని అనేక మంది ప్రజలకు ఆరోగ్య సమస్యలు, శస్త్రచికిత్సల అవసరాల సమయంలో తన సొంత డబ్బులతో వైద్య సహాయం అందించిన వ్యక్తి నిమ్మకాయల చినరాజప్ప అని అన్నారు. కాకినాడ మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో హై డిపెండెన్సీ యూనిట్ (హెచ్డియూ)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందించేందుకు మెడికవర్ హాస్పిటల్స్ నిరంతరం కృషి చేస్తుందని అంజిబాబు తెలిపారు.

# ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి మన జనప్రగతి జూలై 29:**-తిరుపతి నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, భద్రత కోసం స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కింద 2.5 కోట్లతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను బుధవారం ఉదయంఎ ఎం.ఎస్. సుబ్బలక్ష్మి కూడలిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. దీనితో నగరంలోని 11 ప్రధాన సర్కిల్స్ లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాయి. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నూతన ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. వాహనదారులు ముఖ్యంగా టూ వీలర్స్ ట్రాఫిక్ సిగ్నల్స్ కు అనుగుణంగా నడుచుకోవాలని ఆయన కోరారు. అలాగే ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు సిగ్నల్స్ పాటించి ఎటువంటి అప్పాయాలు జరగకుండా సహకరించాలని ఆయన కోరారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సిగ్నలింగ్ వ్యవస్థ కమాండ్ కంట్రోల్ కు అనుసంధానం కావడం వల్ల ఆటోమేటిక్ గా సిగ్నల్ జంప్ అయితే బిల్లులు పడతాయని ఆయన గుర్తు చేశారు. కావున ప్రతి ఒక్కరూ సిగ్నలింగ్ వ్యవస్థను అనుసరించాలని మరొక్కసారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు కొండయ్య, భక్తవత్సలం, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ ఈ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈ.ఈ. రవి, మునిసిపల్ ఇంజినీర్లు తులసి, గోమతి, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# శీతల గంగమ్మ శోభా యాత్ర అలంకరణకు అతికారి కృష్ణ రూ.1,00,116 విరాళం



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 29:**-మండలంలోని మాధవరం-1 పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో జరుగుతున్న శ్రీ శీతల గంగమ్మ తల్లి 23వ జాతర మహోత్సవం సందర్భంగా రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ గురువారం జరిగే అమ్మవారి శోభా యాత్ర అలంకరణ కోసం రూ. 1,00,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా జాతర మహోత్సవానికి అతికారి కృష్ణ ఆర్థిక సహకారం అందిస్తూ భక్తిశ్రద్ధలను చాటుకుంటున్నారని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని రాజకీయంగా మరెన్నో వున్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త దేరంగుల శ్రీకాంత్, మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్, ఆలయ కమిటీ సభ్యులు బిట్టా వెంకటేశు, దాసరి వినోద్ కుమార్, సాయి, సుబ్బరాయుడు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం

## పంట నమోదు చేయిస్తేనే ప్రభుత్వ పథకాలు: మండల వ్యవసాయ అధికారి రాజు



**తొండూరు మన జనప్రగతి జూలై 29:**-మండల పరిధిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మదూరు, కృష్ణం పల్లె గ్రామాలలో నిర్వహించినట్లు తొండూరు మండల వ్యవసాయ అధికారి కే.రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చించిన అంశాలు. ఎల్లినో ప్రభావం దృష్ట్యా తక్కువ నీటిని తీసుకుంటే పంటలను సాగు చేయాలని రైతులకు తెలియజేశారు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ బీమా 31-7-26 చివరి తేదీ అని ఇంకా ఎవరైనా రైతులు ఇన్సూరెన్స్ చేసుకోకుండా ఉన్నట్లయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈపంట ఈఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసినటువంటి ప్రతి పంటను తమ ఆర్ ఎస్ కె సిబ్బంది ద్వారా ఈ పంటలో నమోదు చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో విహెచ్ఎలు ఎంపీఈవోలు గ్రామల రైతులు పాల్గొన్నారు.



# పట్టణ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశాలు

- వివిధ వర్గాలతో కమిషనర్ ముఖాముఖి..!




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 29:-** ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పురపాలక సంఘం కమిషనర్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనున్నారు. ఇటీవల నిర్వహించిన "కమిషనర్ తో ముఖాముఖి" కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తిన సమస్యలు, అలాగే కమిషనర్ వార్డుల పర్యటనలో గుర్తించిన అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు పురపాలక సంఘం విడుదల చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. పట్టణంలోని హోటల్ యజమానులు, చికెన్, మటన్ షాపుల నిర్వాహకులు, తోపుడు బండి వ్యాపారులు, స్ట్రీట్ వెండర్లు, పెద్ద, చిన్న వ్యాపార సముదాయాల యజమానులు, వివిధ రకాల దుకాణాల నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పశువుల యజమానులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించి పట్టణంలో నెలకొన్న పారిశుద్ధ్యం, ట్రాఫిక్, అక్రమ ఆక్రమణలు, ప్రజారోగ్యం, వ్యర్థాల నిర్వహణ తదితర సమస్యలపై సూచనలు, సలహాలు స్వీకరించనున్నారు. సర్క్యులర్ ప్రకారం జూలై 30 ఉదయం 11 గంటలకు హోటల్ యజమానులు, చికెన్‌మటన్ షాపుల నిర్వాహకులు, తోపుడు బండి వ్యాపారులు, స్ట్రీట్ వెండర్లు, పశు వుల యజమానులతో, జూలై 31 ఉదయం 11 గంటలకు పెద్ద, చిన్న వ్యాపార సముదాయాల యజమానులు, వివిధ రకాల దుకాణాల నిర్వాహకులతో, ఆగస్టు 3 మధ్యాహ్నం 4 గంటలకు పట్టణంలోని అధికారులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ మందిరంలో సమావేశాలు నిర్వహించనున్నారు. సంబంధిత వర్గాలందరూ తప్పనిసరిగా సమావేశాలకు హాజరై పట్టణ అభివృద్ధికి తమ వంతు సూచనలు, సహకారం అందించాలని కమిషనర్ కోరారు. అలాగే వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు తమ పరిధిలోని సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించి సమావేశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ప్రొద్దుటూరులో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 29:-** పట్టణంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. వైఎంఆర్ కాలనీ, రామేశ్వరం వసంతపేట, దొరసానిపల్లెలోని సాయిబాబా ఆలయాలతో పాటు వైఎంఆర్ కాలనీలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, మహా నివేదన, మహా మంగళహారతుల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గోక్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ అర్చకులు నిర్వహించారు. గురువును దైవ స్వరూపంగా భావించి ఆరాధించే పవిత్ర దినమే గురుపౌర్ణమి అని, ఆషాఢ పౌర్ణమి రోజున వ్యాస మహర్షిని స్మరించుకుంటూ గురువుల పట్ల కృతజ్ఞతను తెలియజేయడం భారతీయ సంస్కృతిలో విశిష్ట సంప్రదాయమని వారు వివరించారు. గురు అనుగ్రహంతో విద్య, విజ్ఞానం, ఆధ్యాత్మిక చైతన్యం, ఐశ్వర్యం సిద్ధిస్తాయనే విశ్వాసంతో భక్తులు అత్యంత భక్తి, శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణకు విశేష స్పందన లభించింది. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, ప్రత్యేక దర్శన క్యూలైన్లు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయగా, మహిళలు, పురుషులకు వేర్వేరుగా భోజన పంపిణీ నిర్వహించారు. రోజంతా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోగా, భజనలు, సాయినామ స్మరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రొద్దుటూరు పట్టణం గురుభక్తి పరవశంలో మునిగిపోయింది.

# గురుపౌర్ణమి సందర్భంగా శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 29:**-గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్ధవటం మండలంలోని ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయం సమీపంలోని శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శిరిడి సాయిబాబా మూల విరాట్ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసులు శాస్త్రి తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం, కోలాటాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఆవుల రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ బిల్లుల చెల్లింపుకు డిజిటల్ సేవలు మళ్లీ ప్రారంభం



**రైల్వేకోడూరు మన జనప్రగతి జూలై 29:-** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్‌పీడీసీఎల్) వినియోగదారులకు శుభవార్త. 29-7-2026 బుధవారం నుండి విద్యుత్ బిల్లులను డిజిటల్ చెల్లింపు వేదికల ద్వారా నేరుగా చెల్లించే సౌకర్యాన్ని సంస్థ మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది.వినియోగదారులు తమ మొబైల్‌లో డిజిటల్ చెల్లింపు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం బిబిపిఎస్ యాప్ ల ద్వారా ఏపీఎస్‌పీడీసీఎల్‌ను ఎంపిక చేసి,13 అంకెల సర్వీస్ నంబర్ ను నమోదు చేసి ఒకసారి జోడించుకుంటే, అనంతరం ప్రతి నెల విద్యుత్ బిల్లును సులభంగా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు.గత కొంతకాలంగా ఈ సౌకర్యం అందుబాటులో లేకపోయినప్పటికీ, ప్రస్తుతం తిరిగి అమలులోకి రావడం జరిగింది .డిజిటల్ చెల్లింపు విధానాన్ని వినియోగించుకోవడం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు, సురక్షితంగా మరియు సులభంగా విద్యుత్ బిల్లులను చెల్లించే అవకాశం కలుగుతుందని రైల్వే కోడూరు విద్యుత్ శాఖ ఏ.డి తెలిపారు.

# కరెంటు లైన్ మెన్ నిర్లక్ష్యం..విద్యుత్ షాక్ యువకుడు బోయ మునిరంగడు మృతి



**దేవనకొండ మన జన ప్రగతి జులై 29:**-దేవనకొండ మండల పరిధిలోని గుడిమి రాళ్ల గ్రామ నివాసి కూరాకుల బోయ సంజప్ప కుమారుడు బోయ మునిరంగుడు (35) గ్రామంలో ప్రైవేటి విద్యుత్ మెకానిక్ గా పని చేస్తూ జీవనం కొనసాగిసున్నాడు. ఆయనకు ఇద్దరు ఆడ పిల్లలుఉన్నారు.రైతు పొలానికి మోటారు బిగించే పనిలో భాగంగా బుర్రకుంట శీను అనే రైతు పొలంలో ఎల్.సి తీసుకోవడం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతు తన సొంత పొలంలో విద్యుత్ మోటార్లు పనులు చేయస్తున్నాడు. ఈ క్రమంలో 11 కేపి వించ్ పవర్ లైన్ పైభాగంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి బోయ మునిరంగుడు తీవ్ర విద్యుత్ షాక్ గురయ్యాడు.రైతు, ఇరుగుపొరుగువారు ఊట ఊటిన ప్రాథమిక వైద్యం కోసం దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసువెళ్లగా, మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.




మనజనప్రగతి
జనం కోసం... అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
30- 07 - 2026

# సెంట్రల్ కిచెన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి..!

**• కోడూరు నియోజకవర్గ ఏఐటీయూసీ**

**అధ్యక్ష కార్యదర్శులు గంగాధర్ జయరామయ్య**



**చిట్వేలి మన జనప్రగతి జూలై 29:-** మధ్యాహ్న భోజన పథకం కార్మికులను రోడ్డున పడవేసే పైలెట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన సెంట్రల్ కిచెన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని రైల్వే కోడూరు నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు గంగాధర్ జయరామయ్య ప్రభుత్వాన్ని కోరారు. చిట్వేలి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెంట్రల్ కిచెన్ విధానం వల్ల మండలంలో ఒకే చోట వండి ఇతర పాఠశాలలకు పంపించడం వలన అన్నం, కూరలు చల్లారిపోవడం, ముందుగానే వండటం వలన పిల్లలకు ఆహారంలో పోషక విలువలు తగ్గుతాయి అన్నారు. ఈ సెంట్రల్ కిచెన్ విధానం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత పోతుందన్నారు. మండలంలో ఒకే చోట వంట చేయడం వలన అనివార్యంగా కార్మికుల సంఖ్య క్రమక్రమంగా తగ్గిస్తారని, ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తే రాష్ట్రంలో ఉన్న 88,596 వేల మంది మధ్యాహ్న భోజన పథకం కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలు, కార్మికులు అయితే పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎంసి కమిటీల పర్యవేక్షణలో స్వయంగా వండి విద్యార్థులకు వడ్డిస్తారని తెలిపారు. పాఠశాల ఆవరణలోనే ఏజెన్సీ ద్వారా కార్మికులు స్వయంగా వండే ఈ విధానం విద్యార్థులకు బాగా ఉపయోగపడుతుందని, అనారోగ్య సమస్యలకు విద్యార్థులు దూరంగా ఉంటారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సెంట్రల్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని, గౌరవ వేతనం రూ. 3000 తిసుకుంటున్న వీరికి కనీస వేతనం రూ.15000 ఇవ్వాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యం కల్పించాలని, వంట గ్యాస్ సబ్సిడీ మీద ఇవ్వాలని కోరారు. మోడల్ స్కూల్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న బోజనం గత సంవత్సర కాలంగా మెస్ చార్జీలు విడుదల చేయలేదు కనుక వెంటనే ఇంటర్ మెస్ చార్జీలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజవర్గ నాయకురాలు సరోజినమ్మ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నియోజకవర్గ నాయకుడు అల్లావుద్దీన్ భారత కమ్యూనిస్టు పార్టీ మండల నాయకులు తిప్పన ప్రసాద్ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం చిట్వేలు మండల కార్యదర్శి ఈపూరు రెడ్డమ్మ పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెడుతున్న వారి నుంచి రక్షణ కల్పించండి: రైతు కర్ని వీర్రాజు



**కాకినాడ మన జనప్రగతి జూలై 29:-** కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల రైతు బజార్ బజారులో ఉన్న రైతులను తీవ్ర ఇబ్బంది చేస్తున్నారనీ గత 25 సంవత్సరాలుగా అదే రైతు బజార్లో కూరగాయలు పళ్ళు అమ్ముకుంటున్న రైతులు జాయింట్ కలెక్టర్ ను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. అనంతరం బయటకు వచ్చిన రైతులు మీడియాతో మాట్లాడుతూ కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల రైతు బజార్లో మాకినేని భాస్కర్ అనే వ్యక్తి రైతు బజార్ స్థలాన్ని ఆక్రమించుకుని షాపులు కట్టి రైతుబజార్లో ఉన్న రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అడిగితే తాము రైతులం కాదని ఇక్కడ వ్యాపారాలు చేయనీనని బెదిరిస్తున్నారని వాపోయారు. తామంతా రైతుల నేనని ఎప్పటికప్పుడు ఆద్దులు చెల్లిస్తూ వ్యాపారులు చేసుకున్నప్పటికీ అతను తమపై దౌర్జన్యం చేస్తూ కేసులు పెడుతూ ఇబ్బందులు కురిచేస్తున్నారని తమకు న్యాయం చేయాలని కర్ని వీర్రాజు. జనసేన నాయకులతో వచ్చి జెసికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో జనసేన నాయకులు చింతపల్లి బన్నీ మాట్లాడుతూ వ్యవసాయ కమిటీ చైర్మన్ బొచ్చు శేఖర్ అనే వ్యక్తి వైసీపీ నాయకులతో కలిసి కూటమి నాయకులు అన్యాయం చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్ వైస్ చైర్మన్ బడిగంట దేవి మాట్లాడుతూ చైర్మన్ ను తాను వివరణ కోరగా ఎప్పటి వరకు ఏ విధమైన చర్యలు తీసుకోకపోగా తనకు సమాధానం కూడా చెప్పలేదని అన్నారు. జెసిని కలిసిన వారిలో కోడి శ్రీను, నీలపల్లి కామరాజు, కోరుకొండ కనకారావు, యల్ల సత్తిబాబు, గుండ్రం సతీష్ తదితరులు ఉన్నారు.

## ఇది ప్రజా ప్రభుత్వం అంటున్న స్థానిక ప్రజలు

**- 26 డివిజన్‌లో డోర్ టు డోర్ కార్యక్రమం**



**తిరుపతి మన జనప్రగతి జూలై 29 :-** తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువ అవుతున్న నేపథ్యంలో ఇది ప్రజా ప్రభుత్వం అని స్థానిక ప్రజలు నిరాజనాలు పలుకుతున్నారని తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ జేబీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నగరంలోని 26వ డివిజన్ పరిధిలో మూడవ క్లస్టర్ లో రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమ విజయాలపై డోర్ టు డోర్ కార్యక్రమం నియోజకవర్గ ఇన్చార్జ్ జేబీ శ్రీనివాస్ నేతృత్వంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్, తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీ కృష్ణారెడ్డి, శ్రీ తాతయ్య గుంట గంగమ్మ గుడి చైర్మన్ నైనా మహేష్ యాదవ్ పాల్గొన్నారు. జేబీ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ప్రతి ఇంటికి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంట్లో ప్రభుత్వం నుండి ఏదో ఒక లబ్ధి చేకూరడం జరిగిందని చెబుతుంటే ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కో క్లస్టర్ ఇంచార్జ్ కంకణాల రజినీకాంత్ నాయుడు , వార్డు అధ్యక్షులు భాస్కర్, జలపోతు చంద్ర, సుధాకర్ రెడ్డి, నాగ ప్రతాప్ దేవరాజు ఆచారి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, టిడిపి మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా, టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామదాసు ముని రామయ్య, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, ఎస్ కే డి నగర్ విజయ్ శంకర్, సూరి నారాయణరెడ్డి, 26వ డివిజన్ అధ్యక్షులు మోహన్ కుమార్, భారతి, వాణి పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు కేజీకి రూ.20 సాయం

**• రూ.188 కోట్లతో అండగా ప్రభుత్వం: మంత్రి అచ్చెన్నాయుడు**



**అమరావతి మన జనప్రగతి జూలై 29:-** పొగాకు రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు ఉపయోగపడే నిర్మాణాత్మక సూచనలను ప్రభుత్వం స్వాగతిస్తుందని, నెగిటివ్ వ్యాఖ్యలతో రైతులను మరింత నష్టపెట్టవద్దని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల కారణంగా ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి చెప్పారు. రైతులకు కేజీకి రూ.20 చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.188 కోట్లు కేటాయించాయని, 94 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల సమస్యలను నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. రైతులకు మేలు చేసే సూచనలు ఎప్పుడైనా స్వాగతిస్తామని, రాజకీయ విమర్శల కంటే రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.


## జూలై 31న నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ మెగా జాబ్ మేళా

**నెల్లూరు మన జనప్రగతి జూలై 29:-** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూలై 31, 2026 (శుక్రవారం) న నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరులో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఖయ్యూమ్ తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 15 ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని ఆయన పేర్కొన్నారు. బి.టెక్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా, ఇంటర్మీడియట్ మరియు పదో తరగతి పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు మేనేజ్‌మెంట్ సెక్రటరీ వినయ్ కుమార్ మాట్లాడుతూ, నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత తమ అప్‌డేట్ చేసిన రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాలు మరియు అవసరమైన ఇతర పత్రాలతో జాబ్ మేళాకు హాజరై, అదే రోజు ఉద్యోగాన్ని పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ మెగా జాబ్ మేళా ద్వారా వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు మరియు ఉద్యోగార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, యువతకు వారి అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. మెగా జాబ్ మేళా జూలై 31, 2026 (శుక్రవారం) న నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరులో నిర్వహించబడుతుందని, బి.టెక్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా, ఇంటర్మీడియట్ మరియు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు పాల్గొనవచ్చని వెల్లడించారు.

## దుర్గాభవాని ఆలయంలో వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

**• శాకంబరీ దేవిగా అమ్మవారి దివ్య దర్శనం**

**• విశేష అభిషేకాలు..భక్తుల ప్రత్యేక పూజలు..అన్నప్రసాద వితరణ**



**ఉరవకొండ మన జనప్రగతి జూలై 29:-** ఆషాఢ పౌర్ణమి, గురుపౌర్ణమి పర్వదినాలను పురస్కరించుకుని ఉరవకొండలోని శ్రీ దుర్గాభవాని దేవాలయంలో బుధవారం వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పావన సందర్భంగా అమ్మవారు శ్రీ శాకంబరీ దేవి అవతారంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పండుగను పురస్కరించుకుని ప్రాతఃకాలంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలతో పాటు వివిధ సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కాయగూరలు, పండ్లు, ఆకుకూరలతో అమ్మవారిని శ్రీ శాకంబరీ దేవిగా సుందరంగా అలంకరించారు. అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపరవశులయ్యారు. ఈ సందర్భంగా భక్తురాలు ఎం. రామాంజనమ్మ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి వెండి కిరీటాన్ని సమర్పించారు. పలువురు మాతృమూర్తులు బోనాలను నైవేద్యంగా సమర్పించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. వేడుకల నిర్వహణకు, శాకంబరీ దేవి అలంకరణకు, అన్నప్రసాద వితరణకు సహకరించిన మీనాక్షి మొబైల్స్, చిద్దిలా, ఛాయాదేవి, స్వర్ణలత, శాంతి, బాలాజీ, మనోహర్, ప్రవీణ్, దత్తరాజు, జీవన్ నాయుడులతో పాటు పలువురు దాతలు, భక్తులకు ఆలయ కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

## బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు అమలు చేయాలి:రాయల్ బాబు



**పీలేరు మన జనప్రగతి జూలై 29:-** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం న్యూఢిల్లీలోని ఆంధ్ర భవన్‌లో నిర్వహించిన జాతీయ బీసీ సదస్సులో పీలేరు పట్టణానికి చెందిన, బలిజ నాయకుడు మరియు రాష్ట్ర బీసీ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ రాయల్ బాబు రాజేంద్రప్రసాద్ పాల్గొని బీసీల హక్కుల సాధన కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం అందేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక వాటా కల్పించాలని, క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే కేంద్రంలో బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో బీసీల జనాభా లెక్కలను నమోదు చేయాలని, బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లన్నింటినీ పార్లమెంటులో చర్చించి చట్టబద్ధంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీల అభివృద్ధి, సాధికారత కోసం దేశవ్యాప్తంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా బీసీ ఎంపీలు ఆర్. కృష్ణయ్య, బీద మస్తాన్ రావు, పాక సత్యనారాయణ, కర్ణాటకకు చెందిన నాగరాజు హాజరై బీసీ హక్కుల పరిరక్షణపై ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వందలాది మంది బీసీ ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని బీసీల సమస్యలపై చర్చించారు. బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని సదస్సులో తీర్మానించారు.

## అంగన్వాడీ కేంద్రంలో 'స్టాప్ డయేరియా'పై అవగాహన



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 29:-** మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామం నాలుగో అంగన్వాడీ కేంద్రంలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు,గర్భిణులు, పాలిచ్చే తల్లులకు డయేరియా నివారణపై అవగాహన కల్పించారు,ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి మాట్లాడుతూ..ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు డయేరియా వచ్చినప్పుడు జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ద్రావణం వినియోగించడం వల్ల వాంతులు విరేచనాలను తగ్గించవచ్చని వివరించారు. అలాగే కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్, అంగన్వాడీ కార్యకర్త నాగవేణి, ఆశా కార్యకర్తలు ఈరమ్మ,లక్ష్మి, హరిత లక్ష్మి,గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## పార్టీ కోసం అహర్నిశలు అలుపెరుగని పర్యటన

**- తనదైన శైలిలో ముందుకు దూసుకెళుతున్న కసిరెడ్డి వెంకట శివారెడ్డి**



**గాలివీడు మన జనప్రగతి జులై 29:-** గాలివీడు మండలంలో పలు గ్రామాల్లో పర్యటించిన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి. బుధవారం నాడు గాలివీడు మండలంలోని గోరాన్చెరువు గ్రామం హరిజనవాడలో అనారోగ్యం కారణంగా మరణించిన వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం గోపనపల్లి గ్రామంలో గుండె పోటు తో హఠాన్మరణం చెందిన మనోహర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనోధైర్యాన్ని నింపారు. అదే విధంగా పందిగుంట గ్రామంలోని మసీదులో ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం సోదరులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తదుపరి పందిగుంట మరియు గోరాన్చెరువు గ్రామాల్లో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రజలను కలుసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు మరియు పార్టీ కార్యక్రమాలను వివరించారు.

## అజ్ఞానమనే చీకటిని తొలగించే శక్తే గురువు

**- రాయచోటి షిరిడీ సాయి ఆలయంలో జరిగిన గురు పౌర్ణమి వేడుకలలో శ్రీకాంత్ రెడ్డి.**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 29:** అజ్ఞానమనే చీకటిని తొలగించే శక్తే గురువుని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా రాయచోటి షిరిడీ సాయి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి దుస్సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దేవుడి దయతోవర్షాలు సక్రమంగా కురిసి,పంటలు బాగా పండి ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వేదాలు, ఉపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, బ్రహ్మ సూత్రాలు, మహాభారతం, భాగవతం లను మానవాళికి అందించిన మహోన్నతుడు జ్ఞాన బ్రహ్మ వ్యాస మహర్షి జన్మదినమే గురు పౌర్ణిమ అని అన్నారు. తపః సంపన్నులైనటువంటి గురువులను పూజించి జ్ఞానాన్ని పొందే ఆచారానికి గురు పౌర్ణమి భూమికగా నిలుస్తోందన్నారు. మన సంస్కృతి , సంప్రదాయాలలో గురువు కు అగ్రతాంబూలం ఉందన్నారు. సమాజ ఉన్నతికి నిత్యం త్యాగం చేసే గురువులకు వందనాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శి గొర్ల ఉపేంద్రా రెడ్డి, లయన్ నాగేశ్వర రావు, రతీంద్రా రెడ్డి, ఆనంద కుమార్ రెడ్డి,మోక్షిత్, మాజీ సర్పంచ్ వెంకట రమణ నాయక్, సగినాల శివ శంకర్ పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమం గడపగడపకు అందాలి

**● ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో గాజుల ఖాదర్ భాషా**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 29:–**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఐటి విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు ఆదేశాలతో రవాణా మరియు యువజన క్రీడా శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తమ్ముడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి సూచనల మేరకు..కొత్తపేట రామాపురం నందు ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా అనంతరం గాజుల ఖాదర్ బాషా మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు రాష్ట్ర అభివృద్ధి అలాగే రాయచోటి నియోజకవర్గ శాసనసభ్యులు మంత్రివర్యులు మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ రెండేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి సంక్షేమం పై ప్రతి గడపలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు గత వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన మాటలు తప్పి ప్రజలకు మోసం చేశారని గౌరవ ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ సంక్షేమం మరియు అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకు వెళ్తున్నారని పేర్కొన్నారు మహిళలు ఉచిత బస్సు ప్రయాణం వల్ల డబ్బులు మిగులు పెట్టుకొని ఆ డబ్బులు మాకు ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు ఇంతవరకు గతంలో ఉన్న ప్రభుత్వం మహిళల గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు అనునిత్యం చంద్రబాబు నాయుడు ఒక్కరే మహిళల అభివృద్ధి గురించి మహిళలు బాగుంటేనే కుటుంబం బాగుంటుందని ఆలోచిస్తున్నారని చెప్పారు ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్ మల్లికార్జున యూనిట్ ఇంచార్జ్ చంద్ర రావుఫా రఫీ హైదర్ బలరాం మణికంఠ తదితరులు పాల్గొన్నారు

# లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 29:–**స్థానిక చిత్తూర్ రోడ్డు డిగ్రీ కాలేజ్ నుండి 14 కంపెనీల నిరుద్యోగులకు క్యాంపస్ సెలక్షన్స్ జరుగుతున్న సందర్భంగా ప్రతినిధులకు మరియు పిల్లలకు లయన్ మిక్కిలిన ప్రసాద్ నాయుడు ఆర్థిక సౌజన్యంతో భోజన వసతి కల్పించడం జరిగిందని అధ్యక్షులు లయన్ రామాంజనేయరెడ్డి తెలియజేశారు అనంతరం దాత లయన్ మిక్కిలినేని ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు మంచి చదువులు చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి కుటుంబాన్ని ఆర్థికంగా ఇబ్బంద లేకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పిల్లల పైన ఆధారపడి ఉందని అలాంటి పరిస్థితుల్లో ఈరోజు 14 కంపెనీలు సెలక్షన్ రావడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీనివాసరావు మాట్లాడుతూ బుధవారం జాబ్ మేళాకు వచ్చిన 274 మంది పిల్లలలో 134 మంది పిల్లలు ఉద్యోగ అవకాశాలు రావడం చాలా సంతోషమని అలాగే వచ్చిన వారికి అందరికీ భోజనం వసతి కల్పించిన లయన్స్ క్లబ్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులులయన్ పిఎస్ హరినాథ్ రెడ్డి లయన్స్ సభ్యులుఎస్ మహమ్మద్ ఇందాద్ వి హరిచంద్ర వి మురళి రెడ్డి నాయక్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు

# అభివృద్ధి సంక్షేమం టిడిపికి రెండు కళ్ళు

**- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.రమేష్ రెడ్డి**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 29:–**రవాణా యువజన మరియు క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నల్లగుట్టపల్లి గ్రామం హరిజనవాడలో 50వ బూతు నందు మాజీ మార్కెట్ చైర్మన్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రెండు సంవత్సరాల అభివృద్ధి సంక్షేమంపై కూటమి ప్రభుత్వం లో భాగంగా పోలింగ్ బూత్ నెంబర్ 50 లో కరపత్రాలు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి విజయాలను వివరించి వీటిని ప్రజలకు వివరించారు అలాగే గ్రామంలో నాయకులతో కలిసి కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల కన్వీనర్ గంప సుబ్బరాయుడు, నియోజవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, టిడిపి నాయకులు పులగలమారి వెంకట సుబ్బయ్య,మల్లెపం చిన్నప్ప, పెద్దవీటి బాలకృష్ణ, కిషోర్ మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు

# విద్యాసంస్థల వద్ద డ్రోన్లతో పోలీసుల నిఘా..

**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 29:–**అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యార్థినుల భద్రత కోసం పోలీసులు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా చేపట్టారు. జిల్లా ఎస్పీ ధీరజ్ ఆదేశాల మేరకు శక్తి బృందాలు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది సంయుక్తంగా విద్యాసంస్థల పరిసరాలను పర్యవేక్షిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల రాకపోకల సమయంలో ఆకతాయిలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను డ్రోన్ల ద్వారా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే వెంటనే శక్తి టీమ్ లేదా డయల్ 100/112కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విద్యార్థుల భద్రతకు నిరంతరం చర్యలు కొనసాగుతాయని తెలిపారు.



# హరిత రసాయన పరిశోధనలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యం

**యువ శాస్త్రవేత్తలు వినూత్న ఆవిష్కరణలకు ముందుకు రావాలి :డా.టి.రవి**

**ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా జాతీయ రసాయన శాస్త్ర సదస్సు ప్రారంభం**



**తిరుపతి మన జనప్రగతి జూలై 29:–**పర్యావరణ పరిరక్షణకు హరిత రసాయన శాస్త్ర పరిశోధనలు ఎంతో దోహదపడతాయని టీటీడీ సిపిఆర్వో డా. టి. రవి అన్నారు. విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా మలచాల్సిన బాధ్యత యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులపై ఉందని పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల (అటానమస్) రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "పర్యావరణ పరిరక్షణకు దోహదపడే స్థిరమైన రసాయన సమ్మేళనాల తయారీ" (ఎస్‌సీఎస్‌ఆర్‌ఈఐ) అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ రసాయన శాస్త్ర సదస్సు బుధవారం కళాశాల సమావేశ మందిరంలో ఘనంగా ప్రారంభమైంది.కళాశాల ప్రిన్సిపాల్ డా.వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో టీటీడీ సిపిఆర్వో డా.టి.రవి,ఎస్‌పీడబ్ల్యూ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.నారాయణమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా డా.టి.రవి మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణ నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత కీలకమైన అంశమని అన్నారు.హరిత రసాయన శాస్త్ర పరిశోధనలు ప్రకృతి వనరుల సంరక్షణతో పాటు కాలుష్య నియంత్రణకు సమర్థవంతమైన మార్గాలను అందిస్తాయని తెలిపారు.పర్యావరణ హిత సాంకేతికతలను అభివృద్ధి చేస్తూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, సుస్థిరమైన ప్రపంచాన్ని అందించేందుకు విద్యార్థులు పరిశోధనా రంగంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. విద్య, విజ్ఞానం, విలువలు సమన్వయంతో ముందుకు సాగినప్పుడే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు.యువ శాస్త్రవేత్తలు సృజనాత్మక ఆలోచనలతో సమాజ అవసరాలకు పరిష్కారాలు చూపే పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే వినూత్న రసాయన సాంకేతికతల అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

# కామసముద్రంలో పంటల బీమాపై అవగాహన సదస్సు

**పత్తి,మినుము పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన వ్యవసాయ అధికారి రమేష్**



**లింగాల మన జనప్రగతి జూలై 29:–**లింగాల మండల పరిధిలోని కామసముద్రం గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల బీమా, పంటల సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.వ్యవసాయ అధికారి రమేష్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. పంటల బీమా నమోదు గడువుకు కేవలం రెండు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని,అర్హులైన రైతులు వెంటనే నమోదు చేసుకుని పంటలకు రక్షణ కల్పించుకోవాలని కోరారు.అనంతరం ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంటను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం పత్తి పంట 50 నుంచి 60 రోజుల దశలో ఉందని, ఈ సమయంలో పంటలో రసం పీల్చే తామర పురుగు, పెనుబంక ఉధృతి కనిపిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. తామర పురుగు రసం పీల్చడం వల్ల ఆకులు ముడుచుకుపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.తామర పురుగు నివారణకు లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల చొప్పున 1500 పీపీఎం వేపనూనె లేదా 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ లేదా 0.2 గ్రాముల థయామెథాక్సామ్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పెనుబంక ఉధృతి కనిపిస్తే 5 శాతం వేపకషాయం లేదా లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ లేదా 0.25 మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.గులాబీ రంగు పురుగు నివారణకు ముందుజాగ్రత్త చర్యగా పత్తి పంటలో ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలని సూచించారు. వీటి ద్వారా మగ పురుగులను ఆకర్షించి, తదుపరి సంతతి పెరగకుండా నివారించవచ్చని తెలిపారు. గులాబీ రంగు పురుగు ఉధృతి కనిపిస్తే లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనె లేదా 2 మిల్లీలీటర్ల ప్రొఫెనోఫాస్ లేదా 0.2 మిల్లీలీటర్ల ఫ్లూబెండమైడ్ లేదా 0.3 మిల్లీలీటర్ల క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 2.5 మిల్లీలీటర్ల బారజైడ్ కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.అదేవిధంగా రామాపురం గ్రామంలో సుమారు 120 ఎకరాల్లో నెల రోజుల క్రితం సాగు చేసిన మినుము పంటను కూడా పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట బెట్టకు గురికాకుండా లీటరు నీటికి 2 శాతం యూరియా ద్రావణాన్ని కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పురుగుల ఉధృతి కనిపిస్తే లీటరు నీటికి 1.5 గ్రాముల అసిఫేట్, 2 గ్రాముల 19:19:19 ఎరువును కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.కామసముద్రం రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి గంగాధర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# దీమొబైల్స్ షాప్ యజమానులు,మెకానిక్‌ల సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి పత్రం

**కడప మొబైల్ షాప్,టెక్నీషియన్స్ అసోసియేషన్**



**కడప మన జనప్రగతి జూలై 29:–**మొబైల్స్ ఓనర్లు, సెల్ మెకానిక్లు ఎదురొక్కంటున్న సమస్యలను అదిగమించుటకు అందరిక్షేమం కోసంఅసోసియేషన్ను ఏర్పర్చుకొన్నామని అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లయ్య తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా కడప నగరం రైతు బజార్ సర్కిల్ నుంచి కడప మొబైల్స్, టెక్నీషియన్స్ అసోసియేషన్ నాయకులు సభ్యులు పెద్ద ఎత్తున ర్యాలీగా ఎమ్మెల్యే ఇంటి వద్ద చేరుకొని ఎమ్మెల్యే మాధవి రెడ్డికి రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ...గత అనగా 2024వ సంవత్సర ములో మా అసోసియేషన్ రిజి ష్టరు చేయించి గుర్తింపు తెచ్చుకు న్నాము.మేము ఆంధ్ర ప్రదేశ్ మొబైల్ షాపు టెక్నీషియన్ అసోసియేషన్ కు అనుసందానంగా మా యొక్కఅసోసియేషన్ పని చేస్తుంది, ఎవరు కూడా వారి ఇష్టానుసారంగా వ్యాపారం చేయకుండా వారి వాళ్ళ ఇతరు ల కు ఇబ్బంది కలుగకుండా నిర్ధిష్టమై రేట్లు ఫిక్స్ చేసి హోల్ సెల్, రిటైల్ షాపులకు తగాదాలు తప్పులు తలెత్తకుండా మా అసోసియేషన్ చూసుకుటుందన్నారు.మా అసోసియేషన్ భవిష్యత్ ప్రణాళికల గురించి ఎమ్మెల్యే గారికి వివరించడం జరిగింది అన్నారు.ప్రస్తుతం కడప నగరంలో మొబైల్ షాప్ ఓనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే గారికి వివరించడం జరిగిందన్నారు.కడప నగరంలోని మొబైల్ షాప్ ఓనర్లు మరియు టెక్నీషియన్లకు తమ వంతు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే గారిని అసోసియేషన్ సభ్యులు కోరారు.అనంతరం వారు సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మొబైల్ అసోసియేషన్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యక్షుడు రెహమాన్,వాహబ్,షఫీ ఉల్లా,భాష, నగరం చౌదరి,గణపతి,భరత్ పటేల్,మదన్ ,సురేష్ పటేల్,నరేంద్ర చౌదరి అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ నెంబర్స్, అసోసియేషన్ సభ్యులు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ


**● వంట గ్యాస్ కొరతకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ చర్య**

**● ఐసీడీఎస్ వేంపల్లి ప్రాజెక్టు సీడీపీవో వి.సునీత**



**వేముల మన జనప్రగతి జూలై 29:–**వేముల మండల కేంద్రంలోని స్థానిక 3వ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఉదయం వేముల మండల పరిధిలోని 38 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేస్తున్నట్లు ఐసీడీఎస్ వేంపల్లి ప్రాజెక్టు సీడీపీవో వి.సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రస్తుతం వంట గ్యాస్ కొరత కారణంగా అంగన్వాడీ కేంద్రాల్లో ఏర్పడుతున్న అసౌకర్యాలకు ప్రత్యామ్నాయంగా భారత ప్రభుత్వం,నేషనల్ ఎఫిషియెంట్ కుకింగ్ సంస్థ ఇండక్షన్ స్టవ్‌ల వినియోగాన్ని సూచించాయని తెలిపారు.అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55 వేల అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లతో పాటు వంట గిన్నెలను సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఐసీడీఎస్ వేంపల్లి ప్రాజెక్టు పరిధిలోని వేముల మండలంలోని 38 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లను అందజేసినట్లు తెలిపారు.అంగన్వాడీ కార్యకర్తలకు ఇండక్షన్ స్టవ్‌ల పనితీరు,వినియోగ విధానం,నిర్వహణతో పాటు తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ హసీనా,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయంలో పూజలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్



**శేరిలింగంపల్లి మన జనప్రగతి జూలై 29:–** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాజా రాజేశ్వర నగర్ కాలనీలో గల శ్రీ సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన గురు పౌర్ణమి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులు, భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా షేక్ హమీద్ పటేల్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, జ్ఞానాన్ని ప్రసాదించి సమాజానికి సన్మార్గం చూపే గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని పేర్కొన్నారు. అనంతరం గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా ప్రజలకు, భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ గారితో బాటుగా రాజా రాజేశ్వర నగర్ కాలనీ అధ్యక్షులు సుద్దపల్లి విజయ కృష్ణ, కొల్లూరి మధు ముదిరాజ్, ఎం. సూర్యనారాయణ, అజయ్ సింగ్, చిట్టి రాజాబాబు, మద్దిలేటి, డాక్టర్ వెంకటేష్, కచ్చావ దీపక్, ప్రసాద్ తదితరులతో పాటు కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్లతో మధ్యాహ్న భోజన పథకంలో నూతన అధ్యాయం

### జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

### దేశానికే ఆదర్శంగా జిల్లాలో విజయవంతంగా అమలు

### చెన్నూరు మండలం కొండపేట జెడ్పి హైస్కూలు స్మార్ట్ కిచెన్, మైదుకూరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరిశీలన





**చెన్నూరు మన జనప్రగతి జూలై 29:-** ప్రతి విద్యార్థికి నాణ్యమైన,పరిశుభ్రమైన, వేడివేడి భోజనం అందించడమే లక్ష్యంగా గతంలో వంట ఏజెన్సీల నిర్వహణలో ఎదురైన లోపాలను అధిగమిస్తూజిల్లాలో అమలు చేస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ మధ్యాహ్న భోజన పథకంలో గుణాత్మక మార్పుకు నాంది పలుకుతోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. బుధవారం చెన్నూరు మండలం కొండపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో నూతనంగా అమలులోకి తీసుకువచ్చిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ నిర్వహణ, అమలు తీరును పరిశీలించారు, మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు.ఈ సందర్భంగా కొండపేట జెడ్పి ఉన్నత పాఠశాలలోని స్మార్ట్ కిచెన్ను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అత్యాధునిక సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు.గతంలో మధ్యాహ్న భోజన పథకం చిన్నచిన్న వంట ఏజెన్సీల నిర్వహణలో ఉండడంతో పరిశుభ్రత, ఆహార నాణ్యత, పరిమాణం, సమయానికి సరఫరా వంటి అంశాల్లో కొన్ని సమస్యలు ఎదురయ్యేవని అన్నారు. ఆ పరిస్థితులకు పూర్తిగా స్వస్తి పలికేలా జిల్లాలో వినూత్నంగా సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు.ప్రస్తుతం జిల్లాలో స్మార్ట్ కిచెన్ల ద్వారా రోజుకు దాదాపు 35 వేల మంది విద్యార్థులకు పరిశుభ్రమైన, రుచికరమైన, పోషక విలువలు కలిగిన వేడివేడి తాజా భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఈ వ్యవస్థను మరింత విస్తరించి జిల్లాలో రోజుకు సుమారు లక్ష మంది విద్యార్థులకు స్మార్ట్ కిచెన్ కేంద్రాల నుంచి నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించే బృహత్తర కార్యక్రమాన్ని విస్తరించనున్నామని వెల్లడించారు.స్మార్ట్ కిచెన్లలో ఆధునిక యంత్రాలతో పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఆహార తయారీ నుంచి పాఠశాలలకు చేరే వరకు ప్రతి దశలో కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఇంటి భోజనాన్ని తలపించేలా రుచికరమైన, పోషకాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ల విజయవంతమైన నిర్వహణలో మహిళా సంఘాల పాత్ర ప్రశంసనీయమని కలెక్టర్ అన్నారు. వారి సమర్థ నిర్వహణ వల్ల వ్యవస్థ సమర్థవంతంగా కొనసాగుతోందని, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. అందుతున్న సూచనలను పరిగణనలోకి తీసుకుని సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు.మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పాఠశాల భవనాలను స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలను విద్యార్థులు, అధ్యపకులతో మాట్లాడి తెలుసుకున్నారు. కొండపేట కార్యక్రమమంలో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, కడప ఆర్డీవో మురళి, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, పీఆర్ ఎస్ఈ మద్దన్న, ఏపీసీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, పీఆర్, ఎస్-ఎస్ఏ, తాసిల్దార్ విజయకుమారి, ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు, ఎంఈఓలు, సునీత1, సునీత 2,కిచెన్ మేనేజర్లు, ఫుడ్ ట్రక్కు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు తక్షణ చర్యలు: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వినతిపై మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన

### విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని కలెక్టర్ హామీ




**మైదుకూరు,మన జనప్రగతి జూలై 29 : -** మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, శిథిలావస్థకు చేరుకున్న భవనాలు, మౌలిక వసతుల కొరతపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వెంటనే స్పందించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విజ్ఞప్తి మేరకు.. బుధవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను స్వయంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కళాశాలలో తరగతి గదులు, ప్రయోగశాలలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసర ప్రాతిపదికన అన్ని వసతులు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కళాశాల భవనాల దయనీయ పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, అవసరమైన మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. అలాగే నిర్మాణంలో ఉన్న నూతన పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల విడుదలతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు సురక్షితమైన, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు.ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్లో విద్యార్థులు ఎన్నో ఇబ్బందుల మధ్య విద్యాభ్యాసం కొనసాగించడం బాధాకరమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను తక్షణమే కల్పించాలని జిల్లా కలెక్టర్ను కోరినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థను దశలవారీగా బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# దశాబ్దాల రైతుల నిరీక్షణకు తెర

### తిప్పిరెడ్డిపల్లెముదిరెడ్డిపల్లె రైతుల కల సాకారం

### ఎమ్మెల్యే తోకలిసి రూ. 8.90 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన

### మైదుకూరు వ్యవసాయ రంగంలో కొత్త అధ్యాయం : ఎమ్మెల్యే






**మైదుకూరు,మన జనప్రగతి జూలై 29: -**దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న తిప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె గ్రామాల రైతుల కలను సాకారం చేసే దిశగా.. మైదుకూరు నియోజకవర్గంలో మరో చారిత్రాత్మక ఘట్టానికి నాంది పలికామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. బుధవారం మైదుకూరు నియోజకవర్గంలో రూ. 8.90 కోట్ల వ్యయంతో చేపట్టిన తిప్పిరెడ్డిపల్లె ముదిరెడ్డిపల్లె ఎత్తిపోతల పథకం పనులకు.. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రైతు సంతోషమే ప్రభుత్వ విజయానికి నిజమైన కొలమానమని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నీటి వనరుల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రే.90 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే.. రెండు గ్రామాల చెరువులు సమృద్ధిగా నీటితో నిండటమే కాకుండా, వేలాది ఎకరాల ఆయకట్టు భూములకు శాశ్వత సాగునీటి వసతి కల్పించనుందని తెలిపారు. వర్షాలపై ఆధారపడే పరిస్థితి తగ్గి, రైతులు ఏడాది పొడవునా వివిధ పంటలను సాగు చేసే అవకాశం లభిస్తుందని చెప్పారు. దీని వల్ల పంటల ఉత్పాదకత పెరగడంతో పాటు రైతుల ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని వివరించారు.రైతు సంక్షేమమే ప్రభుత్వ పాలనకు ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి వసతుల కల్పన, చెరువుల పునరుద్ధరణ, నీటి నిర్వహణ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా అమలు చేస్తోందన్నారు. రైతుల అవసరాలను గుర్తించి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ ఎత్తిపోతల పథకం కూడా అలాంటి ప్రజాపయోగకరమైన ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందన్నారు.లిలి మైదుకూరు శాసనసభ్యులు శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ... తిప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె గ్రామాల రైతులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సాగునీటి సమస్యకు నేడు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు పడిందన్నారు. మైదుకూరు వ్యవసాయ రంగంలో కొత్త అధ్యాయం అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని, రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు.మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధిలో సాగునీటి ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్న ఎమ్మెల్యే, ఈ పథకం ద్వారా రైతులకు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా రైతుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకొస్తామని హామీ ఇచ్చారు.అంతకుముందు.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ లు.. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇద్దరూ స్వయంగా జేసీబీ యంత్రంపైకి ఎక్కి పనులను ప్రారంభించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వేగంగా అమలవుతున్నాయనే సందేశాన్ని ఈ దృశ్యం ప్రజలకు అందించింది.కార్యక్రమానికి హాజరైన రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ, "దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న మా గ్రామాల రైతుల కల నేడు నిజమైంది. ఈ ప్రాజెక్టును మంజూరు చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారికి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి గారికి జీవితాంతం రుణపడి ఉంటాం" అని కృతజ్ఞతలు తెలిపారు. బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, జలవనరుల శాఖ అధికారు లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, గ్రామాల పెద్దలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అమృత్ 2.0 పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు




**కడప,మన జనప్రగతి జూలై 29 :-**కడప జిల్లాలో అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, జలవనరుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. అమృత్ 2.0 పనుల పురోగతిపై జేసీ డా. నిధి మీనా తోకలిసి సంబందిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా పరిధిలోని కడప, బద్వేల్, మైదుకూరు, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు పట్టణ స్థానిక సంస్థల్లో జరుగుతున్న పనుల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో అమృత్ 2.0 కింద 5 పట్టణ స్థానిక సంస్థల్లో మొత్తం 12 ప్రాజెక్టులు సుమారు రూ.965.45 కోట్ల వ్యయంతో అమలవుతున్నాయని, అదనంగా ఎర్రగుంట్లలో ఏఐఐబీ సహాయంతో మరో తాగునీటి పథకం అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. సమీక్ష సందర్భంగా ప్రతి పట్టణంలో చేపడుతున్న తాగునీటి శుద్ధి కేంద్రాలు, నీటి నిల్వ రిజర్వాయర్లు, పైప్లైన్లు, గృహ కనెక్షన్లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, చెరువుల పునరుద్ధరణ పనుల పురోగతిని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను వేగవంతం చేయడంతో పాటు ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. భూసేకరణ, స్థలాల కేటాయింపు, రెవెన్యూ, సాగునీటి, జాతీయ రహదారులు, రహదారులు-భవనాలు, అటవీ, వ్యవసాయ మార్కెటింగ్ తదితర శాఖల నుంచి అవసరమైన అనుమతులు పెండింగ్లో ఉన్న చోట అధికారులు సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం లోపించకుండా ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. సాంకేతిక నమూనాలు, నిర్మాణ నమూనాలు, భూసాధ్యత నివేదికలు, పైప్లైన్లకు అవసరమైన అనుమతులు, రైల్వే, జాతీయ రహదారులు, అటవీ ప్రాంతాలకు సంబంధించిన అనుమతులను వేగంగా పూర్తిచేసి పనులకు ఆటంకం లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ అంశాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి, వారంవారీగా పురోగతిని సమీక్షించాలని సూచించారు. అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణ ప్రజలకు దీర్ఘకాలిక తాగునీటి భద్రత, ఆధునిక మురుగునీటి నిర్వహణ, చెరువుల పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలు నెరవేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు.ఈ సమావేశంలో కడప ఆర్డీవో మురళి, కెఎంసి కమిషనర్ భవానీప్రసాద్, ప్రజారోగ్య ఎస్ఈ రామ్ మోహన్ రెడ్డి, ఈఈ సతీష్ కుమార్, పురపాలక శాఖ, రెవెన్యూ, సాగునీటి, రహదారులు-భవనాలు, అటవీ, జాతీయ రహదారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు

# పంటల బీమా నమోదు చేసుకోండి..

- **చివరి తేదీ జూలై 31**
- **మండల వ్యవసాయ శాఖ అధికారి సాయికుమార్**



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 29:-**ఖరీఫ్2026 సీజన్కు సంబంధించి వాతావరణ ఆధారిత బీమా,ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులు పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సాయికుమార్ సూచించారు,వరి పంట మినహా అన్ని పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు జూలై 31 చివరి తేదీ కాగా,వరి పంటకు ఆగస్టు 15 వరకు అవకాశం ఉందన్నారు ముఖ్యంగా ఎల్నినో,వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తాము సాగు చేసే పంటలకు స్వీయ డిక్లరేషన్ సమర్పించి మీ సేవ లేదా కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు, బ్యాంకుల ద్వారా పంట రుణాలు రెన్యువల్ చేసుకున్న రైతులు కూడా తమ పంటలకు బీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు,ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై మొగ్గు చూపాలని మండల వ్యవసాయాధికారి సాయికుమార్ కోరారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174